

అభివృద్ధికి ప్రాధాన్యత

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 12లో▸



రేషన్‌కార్డు లేకున్నా..

రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, రేషన్‌కార్డు లేకున్నా మాఫీ వర్తి స్తుందని ఏడీఏ గోపాల్ అన్నారు. 12లో▸



ఎదురుచూపులు ఫలించేనా?

గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి విద్యాశాఖ కృషి చేస్తోంది. కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమిస్తోంది. 13లో▸

న్యూస్‌రీల్

జేఈ వ్యాక్సినేషన్ ప్రారంభం



జేఈ టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ మండలం సిద్దులూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది నుంచి నాలుగేళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, 5 నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు పాఠశాలల్లో వ్యాక్సినేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఆగస్టు 15వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు జేఈ వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. అనంతరం నవాబుపేట, మోమిన్‌పేట, పట్లూర్, బంట్వారం పీహెచ్‌సీ కేంద్రాల పరిధిలో జరిగిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

నేడు, రేపు స్పాట్ కౌన్సెలింగ్

అనంతగిరి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ కోర్సుల్లో మిగిలిన ఖాళీల భర్తీకి శుక్ర, శని వారాల్లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అనంతగిరిపల్లి టీఎస్‌డబ్ల్యూఆర్ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న చేవెళ్ల లో బాలికలకు, 27న కందుకూరులో బాలురకు స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి

ఎస్పీ నారాయణరెడ్డి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

నవాబుపేట: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం ఆయన నవాబుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. మండలంలో జరిగిన పలు సంఘటనల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలగాలని సూచించారు. సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకోరాదన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ పీ శ్రీనివాస్‌రెడ్డి, మోమిన్‌పేట సీఐ ఆంజనేయులు, ఎస్సై భరత్ భూషణ్, సిబ్బంది పాల్గొన్నారు

తాండూరు ఆర్టీసీ డీఎంగా సురేష్ కుమార్



తాండూరు టౌన్: తాండూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా సురేష్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉప్పల్ డిపోలో విధులు నిర్వర్తించిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ డీఎంగా పనిచేసిన సమత దిల్‌సుఖ్‌నగర్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సులను సకాలంలో నడిచేలా చూస్తామన్నారు. డిపో అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న డీఎంను డిపో ఉద్యోగులు, సిబ్బంది, వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

పశుసంవర్ధక శాఖ ఏడీ ప్రభురాజ్ బదిలీ


తాండూరు రూరల్: పశుసంవర్ధక శాఖ తాండూరు డివిజన్ ఏడీ ప్రభురాజ్ బదిలీ అయ్యారు. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ నుంచి ఉత్తర్వులు అందాయి. ఆయన స్థానంలో నారాయణగూడ డివిజన్ ఏడీగా పని చేస్తున్న ప్రవీణ్ తాండూరుకు బదిలీపై వచ్చారు. ఆయన బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. పంచాయతీరాజ్ తాండూరు మండల ఏఈ నందిని చేవెళ్లకు బదిలీ అయినట్లు తెలిసింది. ఐసీడీఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సంగమేశ్వర్ వికారాబాద్‌కు బదిలీపై వెళ్లారు. కొడంగల్ ఐసీడీఎస్ కార్యాలయంలో పని చేస్తున్న రజని తాండూరుకు వచ్చారు. గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

ప్రత్యేక ప్రస్తావన ఏదీ?

సీఎం, స్పీకర్ ప్రాతినిథ్యం వహిస్తున్న జిల్లాకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు నిల్

- అనంతగిరుల అభివృద్ధి ప్రస్తావన
- బడ్జెట్ కేటాయింపులపై మిశ్రమ స్పందన





2024-25 బడ్జెట్

వికారాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేక కేటాయింపులంటూ జరగలేదు. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తుండటంతో బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయిస్తారని ప్రజలు భావించారు. ప్రత్యేక నిధుల ప్రస్తావనే లేకపోవడంతో ఒకింత నిరుత్సాహానికి గురయ్యారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 2,91,159 కోట్లతో బడ్జెట్‌ను ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెటారు. వ్యవసాయ రంగానికి ఊహించిన స్థాయిలో కేటాయింపులు చేశారు. వ్యవసాయ యంత్రీకరణకు ఈ సారి కూడా మొండి చేయి చూపించారు. బడ్జెట్‌పై ప్రతిపక్షాలు అంకెల గారడే తప్పా దీంతో ఒరిగేదేమీలేదని కొట్టిపడేస్తున్నాయి. కడా (కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) పేరుతో ఇప్పటికే ఐదారు వేల కోట్లకు సంబంధించి అనుమతులు ఇచ్చారు. కానీ కేటాయింపుల్లో ఆ ప్రస్తావనే రాలేదు.

సంక్షేమానికి పెద్దపీట

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి భారీగా నిధులు కేటాయించారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో జిల్లాకు 14,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షల చొప్పున జిల్లాకు రూ.700 కోట్ల పైచిలుకు నిధులు రానున్నాయి. అర్హులైన వారందరికీ గృహజ్యోతి పథకం వర్తింపజేస్తామని చెప్పటంతోపాటు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. దీంతో జిల్లాలో 2.40 లక్షల డొమెస్టిక్ కనెక్షన్లు ఉండగా ఇందులో తెల్లరేషన్ కార్డు కలిగి 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారు 1.30 లక్షల మంది ఉన్నారు. వీరందరికీ పథకం అమలు కానుంది. జిల్లాలో సగం అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. బడ్జెట్‌లో అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు కేటాయించిన నేపథ్యంలో వాటికి సొంత భవనాలు, జిల్లాలో 22 గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు సమకూరనున్నాయి. బీసీ సంక్షేమానికి అనుకున్న మేరకు నిధుల కేటాయింపు జరగలేదని ఆ సంఘం నాయకులు పెదవి విరుస్తున్నారు.

'పాలమూరు'కు రూ.2వేల కోట్లు

జిల్లా సాగునీటికి వరప్రదాయినిగా భావించే పాలమూరు ఎత్తిపోతల పథకానికి బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే కోట్‌పల్లి ప్రాజెక్టుకు అలాగే కాలువల మరమ్మతుల కోసం రూ.38 కోట్లతో ప్రతిపాదనలు పంపగా బడ్జెట్ కేటాయింపుల్లో కనిపించలేదు.జుంటుపల్లి, లఖ్నాపూర్, సర్పన్‌పల్లి ప్రాజెక్టులు, కాలువలు మరమ్మతుల ఊసే లేదు.

ఎకో టూరిజానికి గ్రీన్ సిగ్నల్

జిల్లాలో ప్రసిద్ధి చెందిన అనంత పద్మనాభస్వామి ఆలయ సమీపంలోని కొండల్లోనే మూసీ నది ప్రారంభమవుతుంది. ఈ ప్రాంతం పర్యాటకంగానే కాకుండా ఆధ్యాత్మిక పరంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని పలుమార్లు నేతలు హామీ ఇచ్చారు. ఇప్పటికే స్వదేశీ దర్శన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఎకో టూరిజానికి నిధులు మంజూరు చేయటం తోపాటు అనంతగిరి టూరిజం గురించి బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. దీంతో అనంతగిరి పర్యాటకంగా అభివృద్ధి చెందనుంది.

బడ్జెట్ చాలా బాగుంది



గత సర్కారుతో పోలిస్తే ఈ ప్రభుత్వానికి పేదల సంక్షేమంపై ఉన్న చిత్తశుద్ధి ఏంటో బడ్జెట్ కేటాయింపుల్లో క్లియర్‌గా కనిపిస్తోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా అద్భుతంగా ఈ బడ్జెట్ ఉంది. ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయటం కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధికి నిదర్శనం.

– బుయ్యని మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు

అంకెలగారడీ



కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయింపులు భారీగా చూపిస్తూ అంకెలగారడి చేసింది. వాస్తవంలో ఖర్చు కనిపించడంలేదు. వారిచ్చిన ప్రధాన హామీలు, ఆరు గ్యారంటీలు తదితర పథకాల్లో సగానికి పైగా బడ్జెట్‌లో ఊసేలేదు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలకు కేరాఫ్‌గా మారింది.

– మెతుకు ఆనంద్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

బీసీలకు తీరని అన్యాయం



కాంగ్రెస్ చెప్పిన బీసీ డిక్లరేషన్ ఏమైంది? బీసీ డిక్లరేషన్ అంటే బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష చూపించడమేనా? 15శాతం ఉన్న ఎస్సీలకు రూ.23వేల కోట్లు.. 10శాతం ఉన్న ఎస్టీలకు రూ.17 వేల కోట్లు.. 50శాతానికి పైగా ఉన్న బీసీలకు రూ.9 వేల కోట్లేనా.. ఇదెక్కడి న్యాయం.

– నాగేశ్వర్, జేఏసీ చైర్మన్, వికారాబాద్ జిల్లా



రుణమాఫీ కొందరికేనా?

- అర్హులకు అమలు కాని పథకం
- ఆందోళనలో అన్నదాతలు

మోమిన్‌పేట: మొదటి విడతలో భాగంగా లక్ష రూపాయల రుణమాఫీ చేసిన విషయం తెలిసిందే. అయితే జాబితాలో పేరు ఉన్న రైతులు బ్యాంకులకు వెళ్లి వడ్డీ చెల్లించి తిరిగి రుణం పొందుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులు ఎక్కువ మంది ఉన్నా కేవలం 25శాతం మందికి మాత్రమే పథకం వర్తించిందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకే ఖాతా ఉన్న మాకెందుకు మాఫీ కాలేదని ప్రశ్నిస్తున్నారు. మోమిన్‌పేట పీఏసీఎస్‌లో రూ.లక్ష లోపు రుణం ఉన్న రైతులు 1,086మంది ఉండగా మాఫీ జాబితాలో కేవలం 150మంది పేర్లు మాత్రమే ఉన్నాయి. అదే విధంగా మేకవనంపల్లి పీఏసీఎస్‌లో రూ.లక్ష లోపు రుణం ఉన్న రైతులు 839మంది ఉండగా 303మంది రైతుల పేర్లు జాబితాలో ఉన్నాయి. మిగతా వారి పరిస్థితి ఏంటని వారు నిలదీస్తున్నారు. మండలంలోని రెండు సహకార సంఘాల రైతుల వివరాలు ఇలా ఉంటే ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, గోల్కొండ గ్రామీణ బ్యాంకుల్లో ఉన్న ఖాతాదారుల పరిస్థితి ఏంటని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఒక కుటుంబంలో రెండు ఖాతాలు ఉన్న వారికి పంట రుణాలు మాఫీ అయ్యాయని, ఒక ఖాతా ఉన్న తమకు పథకం ఎందుకు అమలు కావడం లేదో అర్థం కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ అర్హతను బట్టి రుణమాఫీ అమలు చేస్తున్నారో తెలియడం లేదని వాపోతున్నారు.

సాంకేతిక సమస్యతో..

ఒక రైతుకు సంబంధించిన ఆధార్ నంబరు మరో రైతు బ్యాంక్ ఖాతాకు అనుసంధానం కావడం వంటి సమస్యల కారణంగా అర్హులకు రుణమాఫీ కావడం లేదు. మండలంలోని ఏన్కతల గ్రామానికి చెందిన పటేల్‌గారి మల్లమ్మ మహిళ రైతు రుణ ఖాతా మోమిన్‌పేట పీఏసీఎస్‌లో ఉంది. ఆమె ఆధార్ నంబరుతో యాచారంలోని పీఏసీఎస్‌లో స్వరూపకు అనుసంధానం అయ్యింది. ఇది ఎలా జరిగిందో తెలియడం లేదు. మల్లమ్మకు మాత్రం రుణమాఫీ కాలేదు. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇలాంటి సాంకేతిక సమస్యలు రుణమాఫీకి అడ్డంకిగా మారినట్లు తెలిసింది. కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అమలుచేయాలని రైతులు కోరుతున్నారు.

పోలీస్ పహారాలో చిలుకూరు



వక్ఫ్‌బోర్డు స్థలం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

మొయినాబాద్: చిలుకూరులో పోలీస్ పహారా కొనసాగుతోంది. మొయినాబాద్ మండలం చిలుకూరు రెవెన్యూ సర్వేనంబర్ 133లోని 4 గుంటల వక్ఫ్‌బోర్డు స్థలంలో పురాతన నిర్మాణాన్ని తొలగించడంపై రెండు వర్గాలు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఇది మతపరమైన వివాదాలకు దారితీస్తుందని భావించిన పోలీసులు జోక్యం చేసుకుని రెండు వర్గాలకు నచ్చజెప్పి ఎవరినీ అక్కడికి రాకుండా చర్యలు తీసుకున్నారు. వక్ఫ్‌బోర్డు స్థలంలో యథాతథ స్థితిని కొనసాగిస్తున్నారు. స్థలం వద్దకు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. గురువారం సైతం పోలీస్ పికెటింగ్ కొనసాగింది. సుమారు 40 మంది పోలీసులు చిలుకూరులో పహారా కాస్తున్నారు. చిలుకూరు బాలాజీ దేవాలయం వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేసి పంపిస్తున్నారు. వక్ఫ్‌బోర్డు స్థలంపై ప్రభుత్వం, వక్ఫ్‌బోర్డు అధికారులు నిర్ణయం తీసుకునేవరకు పోలీస్ పహారా కొనసాగుతుందని.. ఈ నెల 30 వరకు 144 సెక్షన్ కొనసాగుతుందని ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్‌రెడ్డి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే..

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సీజనల్ వ్యాధుల నియంత్రణ, సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కమిషనర్లు నిత్యం ఏదో ఒక వార్డు/డివిజన్‌లో పర్యటించాల్సిందేనని కలెక్టర్ శశాంక స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులు, వనమహోత్సవం, వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు, అసంపూర్తిగా మిగిలిన పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క మున్సిపల్ కమిషనర్ ఉదయాన్నే ఏడు గంటలకు ఫీల్డ్ విజిట్‌లో ఉండి, శానిటరీ సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లలో నివాసం ఉంటున్న కుటుంబాలను గుర్తించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, క్లోరినేషన్ శాతాన్ని పెంచాలని సూచించారు.

కుక్కల బెడద లేకుండా చూడాలి

డెంగీ, మలేరియా వ్యాధులపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, రెసిడెన్షియల్ హాస్టళ్లు, కాలనీల్లో నీటి నిల్వలు లేకుండా, దోమల బెడద లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయించాలన్నారు. కాలనీల్లో వీధి కుక్కల బెడద లేకుండా రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా వివిధ ఏజెన్సీలతో ఒప్పందం చేసుకొని మున్సిపల్ పరిధిలో సెంటర్లను ఏర్పాటు చేసి వీధికుక్కలకు శస్త్ర చికిత్సలు చేయించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా గేటెడ్ కమ్యూనిటీ, వెల్ఫేర్ అసోసియేషన్, కాలనీ వాసులను భాగస్వాములు చేసి ప్రతి ఇంటికీ మొక్కల పంపిణీ చేపట్టాలన్నారు. అనువుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటి, మున్సిపల్ వారికి కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా అటవీశాఖ అధికారులు, పీడీ మెప్మా, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

బీమా.. ధీమా

- జిల్లాలో బీమా చేసుకున్న రైతులు 1,57,577 మంది
- రెన్యూవల్ చేసుకుంది 31,773మంది
- కొత్తగా నమోదైన వారు 1,021 మంది



దోమ రైతు వేదికలో అన్నదాతల నుంచి బీమా దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈఓలు

దోమ: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని అమలు చేస్తోంది. అర్హత కలిగిన అన్నదాతలకు బీమా ప్రీమియం చెల్లిస్తూ ఆ కుటుంబాలకు అండగా నిలుస్తోంది. బీమా పొందిన రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ. 5లక్షల పరిహారం అందుతుంది. పథకం అమలులో భాగంగా పట్టా పాసుపుస్తకాలు పొందిన రైతుల నుంచి వివరాలు సేకరించి బీమాను వర్తింపజేసేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

అర్హులందరికీ పథకం వర్తింపు

జిల్లా వ్యాప్తంగా గతంలో 1,57,577 మంది రైతులు బీమా చేసుకున్నారు. ప్రస్తుతం వీటిని వ్యవసాయ అధికారులు రెన్యువల్ చేస్తున్నారు. ఇప్పటి వరకు 31,773 మంది రైతుల బీమా పాలసీలను అధికారులు రెన్యూవల్ చేయగా, వారితో పాటు కొత్తగా 1,021 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో నూతన పట్టాదారు రైతులు 17 వేల వరకు ఉంటారని, మిగతా వారివి దరఖాస్తు స్వీకరిస్తున్నామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల రైతులందరూ ఈ పథకానికి అర్హులని తెలిపారు.

ఆగస్టు 5వరకు అవకాశం

కొత్తగా పట్టాలు పొందిన రైతులు వ్యవసాయ శాఖ అధికారుల వద్ద బీమా కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఆగస్టు 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. నామినీ పేర్లు సైతం మార్చుకోవడానికి అవకాశం ఉంది. రైతులు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను ఆయా క్లస్టర్ల ఏఈఓలకు అందజేయాలి. వాటి ఆధారంగా ఏఈఓలు బీమా దరఖాస్తులను పూర్తి చేసి నెల రోజుల వ్యవధిలో బీమాకు సంబంధించిన బాండ్‌ను రైతులకు అందజేస్తారు.

సద్వినియోగం చేసుకోండి



రైతు బీమా పథకం పేదలకు ఎంతో ఉపయోగపడుతుంది. దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. కొత్తగా పట్టా పాసుపుస్తకం వచ్చిన ప్రతి రైతూ ఏఈఓను సంప్రదించి రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి.

– జి.రాములు, కాంగ్రెస్ పార్టీ యువనేత, బొంపల్లి

అవగాహన కల్పిస్తున్నాం



నూతన పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే పలువురు రైతులు ముందుకు వచ్చారు. మిగతా రైతులు సైతం దరఖాస్తు చేసుకుంటే బీమా వర్తిస్తుంది. ఈ విషయంపై అవగాహన కల్పిస్తున్నాం.

– కావ్య, ఏఈఓ, దోమ

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



జిల్లాలో అర్హులైన వారికి రైతుబీమా వర్తిస్తుంది. కొత్తగా పట్టాలు పొందిన వారు మండల వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదిస్తే బీమా సదుపాయం కల్పిస్తారు. ఇందుకు గాను ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు.

– గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

చికిత్సకోసం వెళ్లి వ్యక్తి అదృశ్యం


ఆంజనేయులు(ఫైల్)

బంట్వారం: చికిత్స కోసం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లి వ్యక్తి అదృశ్యమయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి నాగారం గ్రామానికి చెందిన బండి ఆంజనేయులు(40) కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో వైద్యం చేయించేందుకు కుటుంబీకులు మంగళవారం ఉస్మానియాకు తీసుకెళ్లారు. ఓపీలో చూపించుకున్నారు. ఆ రోజు అక్కడే బస చేశారు. బుధవారం ఉదయం ఆంజనేయులు కనిపించకుండా పోయాడు. కుటుంబీకులు ఆస్పత్రి పరిసర ప్రాంతంలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతడి భార్య అమృతమ్మ గురువారం అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 9989392499, 9032141791 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కుటుంబీకులు కోరారు.

రాడార్ ఏర్పాటుతో జీవరాశులకు ప్రాణసంకటం


రామన్న మాదిగ

దోమ: నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు జీవరాశులకు ప్రాణసంకటంగా మారనుందని, ఈ ప్రాంతంలో నెలకొల్పటం సరి కాదని తెలంగాణ ఉద్యమ చైతన్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామన్న మాదిగ గురువారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. పూడూరు మండలం అటవీ ప్రాంతంలో ఈ నెల 28న కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. శంకుస్థాపన పునరాలోచించాలని సూచించారు. రాడార్ ఏర్పాటు వలన వాతావరణం దెబ్బతినడంతో పాటు, రేడియేషన్ ప్రభావం జీవకోటిపై పడుతుందని శాస్త్రవేత్తలు, నిపుణులు పేర్కొంటున్నారని వెల్లడించారు. రాడార్ ఏర్పాటు సమంజసం కాదని, ప్రభుత్వాలు మరోసారి ఆలోచించాలని రమాన్న మాదిగ కోరారు.

భారీగా గుట్కా పట్టివేత


పట్టుబడిన గుట్కా ప్యాకెట్లు, కాలం చెల్లిన వాటర్ బాటిళ్లు

పరిగి: టాస్క్‌ఫోర్స్, పోలీసుల దాడుల్లో భారీగా గుట్కా ప్యాకెట్లు పట్టుబడ్డాయి. గురువారం పట్టణ కేంద్రంలోని విఘ్నేశ్వర ట్రేడర్స్‌లో సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో నిషేధిత గుట్కా, కాలం చెల్లిన వాటర్ బాటిళ్లు, తదితర సామగ్రి భారీగా లభ్యమయింది. దీంతో పోలీసులు దుకాణ యజమానిపై కేసు నమోదు చేసి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత వస్తువులను విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

అడిషనల్ ఎస్పీ కుమారుడిపై దాడి

ఆదిబట్ల పీఎస్‌లో కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: అడిషనల్ ఎస్పీ కుమారుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనపై ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సురకంటి మల్లారెడ్డి (అడిషనల్ ఎస్పీ)కుమారుడు భరత్‌రెడ్డి సీవీఆర్ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఈ నెల 24న స్నేహితుడు జాల వర్షిత్‌కు యాక్సిడెంట్ అయి.. మన్నెగూడలోని ప్రైవేటు అస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న భరత్.. తన కారులో అస్పత్రికి వెళ్లాడు. స్నేహితుడి మామ రోడ్డు ప్రమాదానికి కారకులైన వారితో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదానికి కారకుడైన వ్యక్తి మిత్రులు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిపై దుర్భాషలాడారు. దీనికి భరత్ అడ్డు చెబుతూ.. ఎందుకు తిడుతున్నారని ప్రశ్నించాడు. దీంతో సదరు వ్యక్తులు భరత్‌పై దాడికి దిగారు. భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పద్దులో.. అభివృద్ధికి ప్రాధాన్యత

సాగునీటి ప్రాజెక్టులకు నిధుల వరద

- వచ్చే ఏడాది లోపు ఆర్అండ్‌బీ రోడ్ల విస్తరణ
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి


ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే బీఎమ్మార్ తదితరులు

తాండూరు: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీలో ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రస్తుత బడ్జెట్ చరిత్రాత్మకంగా ఉందని కొనియాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లు అప్పులు చేసినా.. సంక్షేమం, అభివృద్ధి చేయడంలో విఫలమయిందని ఆయన ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి.. అన్ని వర్గాలకు పెద్దపీట వేశారని తెలిపారు.

చిలుక వాగు ప్రక్షాళనకు రూ.30కోట్లు!

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత చూపిందని ఎమ్మెల్యే చెప్పారు. రైతులకు రుణమాఫీ చేసేందుకు రూ.31వేల కోట్లను ఈ పద్దులో కేటాయించడం హర్షణీయమన్నారు. సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి రూ.26 వేల కోట్లు నిధులు రానుండంతో నియోజవకర్గంలోని కోట్‌పల్లి, జుంటిపల్లి, శివసాగర్ ప్రాజెక్టులకు కొత్తకళ సంతరించుకోనుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని గొల్ల చెరువు అభివృద్ధికి రూ.5 కోట్లు రానున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. చిలుక వాగు ప్రక్షాళనకు ఇప్పటికే రూ.16 కోట్లు మంజూరు అయ్యాయని, అవి సరిపోవని, రూ.30 కోట్లకు పెంచి త్వరలో పనులు ప్రారంభిస్తామని బీఎమ్మార్ వివరించారు. యాలాల మండలం దౌల్తాపూర్ గ్రామం వద్ద ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు భూమిని గుర్తించామని, పనులను త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

ఇందిరమ్మ ఇంటికి రూ.5లక్షలు

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇంటిని నిర్మించుకునేందుకు రూ.5 లక్షల సాయం అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.10 లక్షల జీవిత బీమా కల్పించనున్నామని ఆయన చెప్పారు. తాండూరు– హైదరాబాద్ రోడ్డు మార్గంతో పాటు గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారులను మెరుగు పరుస్తామని ఎమ్మెల్యే స్పష్టంచేశారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయం



ధారూరు: కాంగ్రెస్ ప్రభుత్వం జనరంజక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందని పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి అన్నారు. ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం వ్యవసాయ, సాగునీటి రంగాలకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చిందని పట్లోళ్ల తెలిపారు. తెలంగాణను అప్పుల ఊబిలో దింపి, కేంద్రం రాష్ట్రానికి మొండిచేయి చూపించినా మాజీ సీఎం కేసీఆర్ నోరు మెదపడం లేదని ఆయన విమర్శించారు.

రేషన్‌కార్డు లేకున్నా రుణమాఫీ

జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి గోపాల్

బషీరాబాద్: రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, రేషన్‌కార్డు లేకున్నా మాఫీ వర్తిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. గురువారం మండల పరిధి నీళ్లపల్లి, ఇస్మాయిల్ పూర్, మర్పల్లి గ్రామాల్లో పంట పొలాలను ఆయన పరిశీలించారు. ప్రస్తుత వర్షాలకు పంటలను కాపాడుకోవడానికి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని, పొలాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. మందులు, ఎరువులు ఏ సమయానికి ఎంత వాడాలో వ్యవసాయ అధికారుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. అలాగే సాగు చేస్తున్న పంటలను రైతులు ఏఈఓల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. అర్హత ఉండి రుణమాఫీ కాని రైతులు.. వ్యవసాయ అధికారుల దృష్టికి తేవాలని పేర్కొన్నారు. రైతు బీమా చేసుకోని వారు.. ఆగస్టు 5వరకు ఏఈఓల వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం కాశీంపూర్ రైతు వేదికలో స్థానిక రైతులతో సమావేశం అయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ ఉన్నారు.

ప్రయాణికుడిని రక్షించిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది


ప్రయాణికుడిని కాపాడుతున్న ఆర్‌పీఎఫ్

అనంతగిరి: కదులుతున్న రైలును ఎక్కేందుకు యత్నించిన ప్రయాణికుడు అదుపుతప్పి రైలు కింద పడబోయాడు. అప్రమత్తమైన ఆర్‌పీఎఫ్ సిబ్బంది సదరు వ్యక్తిని కాపాడారు. ఈ సంఘటన వికారాబాద్ రైల్వే ప్లాట్‌ఫారంపై చోటు చేసుకుంది. ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి షిరిడీ ఎక్స్‌ప్రెస్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై వచ్చింది. కాగా జనరల్ బోగిలో సికింద్రాబాద్ నుంచి ప్రయాణిస్తున్న ఏక్‌నాథ్ కాంబ్లే.. వికారాబాద్‌లో రైలు ఆగిన సమయంలో నీటి కోసం కిందకు దిగాడు. ఈ క్రమంలో రైలు కదలడంతో అతడు ఎక్కేందుకు యత్నించగా.. కాలు జారింది. దీంతో రైలుకిందికు పడబోతుండగా.. ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ రమేష్‌దాస్ సదరు వ్యక్తిని గట్టిగా బయటకు లాగి కాపాడాడు. దీంతో సిబ్బందిని అధికారులు, ప్రయాణికులు అభినందించారు.

‘ఉపాధి’ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

- కూలీలకు 200రోజులు పని కల్పించాలి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేశ్


సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశ్

పరిగి: కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేశ్ ఆరోపించారు. గురువారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన కార్మిక, యువజన సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు ఎక్కువ శాతం ఉపాధి పథకంపైనే ఆధారపడి ఉన్నారని, వారికి ఏటా 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం.. పథకంలో మార్పులు తెచ్చి, చివరకు స్కీంను ఎత్తివేయాలని ప్రయత్నిస్తుందని పునరుద్ఘాటించారు. పని ప్రదేశాల్లో కూలీల ఫొటోలు తీసి అప్లోడ్ చేయడం వంటి నిబంధనలు తెచ్చి, వారికి సక్రమంగా వేతనాలు ఎందుకు చెల్లిచడం లేదని ప్రశ్నించారు. కార్మికులు, పేదల సంక్షేమం కోసం తాము ఎల్లప్పుడు పోరాటం చేస్తూనే ఉంటామని వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, ఏఐవైఎఫ్ రాష్ట ఉపాధ్యక్షుడు శ్రీమన్, పరిగి డివిజన్ కార్యదర్శి పీర్ మహ్మద్, మండల కార్యదర్శి వెంకటేశ్, జంగయ్య, చంద్రయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడిన అంగన్‌వాడీ భవనం పైకప్పు

పిల్లలు లేకపోవడంతో తప్పిన ప్రమాదం


వరండాలో పెచ్చులూడిన ప్రదేశం


అంగన్‌వాడీ కేంద్రం గది పైకప్పు

ధారూరు: శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనంపై కప్పు పెచ్చులూడింది. ఈ సంఘటన గురువారం ఉదయం మండల పరిధిలో చోటుచేసుకుంది. అప్పటికీ పిల్లలు ఎవరూ సెంటర్‌కు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. అవుసుపల్లి గ్రామంలో శిథిల భవనంలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. ఇది పురాతన భవనం కావడంతో.. మరో చోటికి మార్చాలని సీడీపీఓ గతంలో సంబంధిత టీచర్‌ను ఆదేశించారని, అయినా టీచర్ అందులోనే కొనసాగిస్తున్నారని స్థానికుల ద్వారా తెలిసింది. అద్దెకు భవనం దొరకలేదన్న సాకుతో.. పాత బంగ్లాలోనే పిల్లలను కూర్చోబెడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు లేని సమయంలో ప్రమాదం జరిగిందని, అదే వారు ఉండింటే ప్రాణాపాయం జరిగి ఉండేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు. శిథిల భవనంలో బడి కొనసాగడాన్ని వ్యతిరేకిస్తున్నా.. టీచర్ మొండిగా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయంలో కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. కాగా.. పెచ్చులు ఊడిన విషయం బయటకు పొక్కకుండా.. ఆ టీచర్ మట్టి పెల్లలను ఊడ్చేసి, ఎప్పటిలాగే చిన్నారులను బడిలో కూర్చోబెట్టినట్లు తెలిసింది. ఇదే విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో విషయం వెలుగు చూసింది.

కొత్త భవనం ఉన్నా..

అంగన్‌వాడీ కేంద్రానికి 4 సంవత్సరాల క్రితం కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. వివిధ కారణాలతో ప్రారంభం వాయిదా పడుతూ వచ్చింది. కొత్త భవనం ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్న సమయంలో పాత భవనం పెచ్చులూడటం ఆందోళనకు గురిచేసింది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ధారూరు: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశానుసారం గురువారం క్యాంపు కార్యాలయంలో 16 మంది లబ్ధిదారులకు రూ. 12 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడారు. అసంపూర్తి దోర్నాల్ వంతెన పనులు ప్రారంభింపచేశారని, పెండింగ్ బిల్లులను స్పీకర్ ఇప్పించారని తెలిపారు. గ్రామం, తండాల్లో రోడ్ల నిర్మాణం కోసం ఎన్ఆర్ఈజీఎల్ నుంచి రూ.2.70 కోట్లు మంజూరు చేయించారని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణకు రూ.150 కోట్లు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీసీసీ సోషల్ మీడియా కార్యదర్శి చామల రఘుపతిరెడ్డి, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

వృత్తిదారుల సమస్యలు పరిష్కరించండి


సమితి కార్యవర్గ సభ్యులతో గోపి

రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి

కొడంగల్ రూరల్: రజక వృత్తిదారుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధి రావులపల్లి హనుమాన్ దేవాలయంలో సమితి జిల్లా ఉపాధ్యక్షుడు సి.బాలప్ప, మండల కన్వీనర్ సి.మోహన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బట్టలు ఉతకడానికి అందుబాటులో బావులు లేకపోవడం వలన సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. కావున ధోబీ ఘాట్లను నిర్మించాలని కోరారు. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పించాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, 45 ఏళ్లు పైబడిన ప్రతి వృత్తిదారుడికి పింఛన్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షల బీమా అందించాలని కోరారు. కార్యక్రమంలో సమితి జిల్లా కార్యదర్శి వెంకటప్ప, దౌల్తాబాద్ అధ్యక్షుడు వెంకటప్ప, మొగులప్ప, శ్యామప్ప, సాయిలు, నర్సప్ప, వెంకటమ్మ, కిష్టమ్మ పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి

రైల్వే మంత్రిని కోరిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


లోక్‌సభ సమావేశాల్లో ప్రసంగిస్తున్న ఎంపీ

బషీరాబాద్: జిల్లాలోని బషీరాబాద్ (నావంద్గీ) రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చొరవ తీసుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రైల్వే మంత్రిని కోరారు. గురువారం జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ఆయన తెలుగులో ప్రసంగించారు. బషీరాబాద్ మీదుగా వెళ్లే హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైలును నిలపాలని కోరారు. మూడు రోజులుగా రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలును కూడా నిలపడంలేదని సభ దృష్టికి తెచ్చారు. వీటిపై రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ కొండా తెలిపారు.

మద్యం సీసాలో బల్లి!

అనంతగిరి: మద్యం సీసాలో బల్లి వచ్చిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్‌కు చెందిన ఓ యువకుడు ఈ నెల 22న ఎన్నెపల్లి సమీపంలో ఉన్న ఓ వైన్ షాపులో ఫుల్ బాటిల్ కొనుగోలు చేశాడు. అనంతరం మిత్రులతో కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో మిగిలిన సగం మందు సీసాలో చచ్చిపోయిన బల్లి ఉండటాన్ని గుర్తించి ఆందోళన చెందారు. దీంతో రాత్రిపూట మూడు నాలుగు సార్లు విరేచనాలు కావడంతో మాత్రలు వాడి.. కోలుకున్నారు.

రైతు కేంద్రాలు కళకళ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న వ్యవసాయ అధికారి

దుద్యాల్: రైతన్నలతో రైతు కేంద్రాలు కళకళలాడుతున్నాయి. పంట నమోదు, రైతుబీమా నమోదు చేసుకునేందుకు కొందరు, పంట రుణాలు మాఫీ కాని అన్నదాతలు అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. అందులో భాగంగా గురువారం హస్నాబాద్ రైతు కేంద్రం కర్షకులతో సందడిగా కనిపించింది.

మెదడువాపు నివారణకు టీకాలు

తప్పనిసరిగా వేయించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ పిలుపు


అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో వ్యాక్సినేషన్ ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

మొయినాబాద్‌రూరల్: చిన్న పిల్లలకు మెదడువాపు వ్యాధి సోకకుండా ప్రభుత్వం ముందస్తుగా టీకాలు వేయిస్తుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ తెలిపారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం మండలంలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో డీఎంహెచ్‌ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముందుగా రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలో ఈ వ్యాక్సినేషన్ ప్రారంభమైందన్నారు. మండలంలో అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తేదీల వారీగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు టీకాలు వేస్తారన్నారు. గురువారం నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు టీకా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు మెదడువాపు వ్యాధి నివారణ కోసం జేఈ టీకా ఇస్తామన్నారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. వైద్యులు, సిబ్బంది విద్యార్థుల పట్ల జాగ్రత్తలు వహిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అన్నపూర్ణ, వైద్యులు తారాఫాతిమా, ఫిర్దోస్‌బేగం, సాయిబాబా, సూపర్‌వైజర్ సునీతాదేవి, ప్రధానోపాధ్యాయుడు అరుణ్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించాలి


నాలా వద్ద ప్రధాన రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులు

బీజేపీ బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

బడంగ్‌పేట్: నాలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బడంగ్‌పేటలో బీజేపీ నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. స్థానికంగా ఆక్రమణలతో మూసుకుపోయిన నాలా వద్ద పార్టీ బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి నాయకులతో వర్షంలో తడుస్తూ బైఠాయించారు. బీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నడికుడి యాదగిరి, బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డితో కలిసి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. దేవతలగుట్ట, డిఫెన్స్‌లోని చెరువులు, నాదర్‌గుల్‌లోని చెరువులు నిండి నాలాల మీదుగా నీరు వస్తున్నాయన్నారు. వేంకటేశ్వరకాలనీ, కాశీబుగ్గ టెంపుల్, శివనారాయణపురం మీదుగా మంత్రాల చెరువు అటు నుంచి సరూర్‌నగర్ చెరువులోకి వరదనీరు వెళుతున్నాయన్నారు. కొందరు అక్రమార్కులు బడంగ్‌పేటలో నాలాలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. ఎస్ఎన్‌డీపీ పనులు పేరుతో అసలైన నాలాలను పట్టించుకోకుండా చూసీచూడనట్లు వ్యవహరించారన్నారు. రెండేళ్ల క్రితం భారీ వరదలకు 17కు పైగా కాలనీలు రెండు నెలల పాటు నీటిలో మునిగాయన్నారు. మళ్లీ వరదలు వస్తే కాలనీల పరిస్థితి ఎంటని ప్రశ్నించారు. పలుమార్లు తహసీల్దార్, బడంగ్‌పేట కమిషనర్, ఆర్డీఓ, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం శూన్యమన్నారు. నాలాలపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎనిమిది రోజులు గడువు ఇస్తున్నామని, ఆలోపు చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లాలా సందీప్, సంతోష్, నివేదిత, సైదులు, లక్ష్మణ్, నర్సింహారెడ్డి, పవన్, ప్రవీణ్, శశిధర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం

మహిళ ప్రతిఘటించడంతో దుండగులు పరార్

కొత్తూరు: సిగరెట్ల కోసం బైకుపై వచ్చిన ఇద్దరు యువకులు చైన్ స్నాచింగ్‌కు యత్నించారు. మహిళ ప్రతిఘటించడంతో ఇరువురూ పరారయ్యారు. ఈ సంఘటన కొత్తూరు మండలంలోని కొడిచర్ల పంచాయతీ ఖాజిగూడతండాలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత మహిళ వివరాల మేరకు.. కొడావత్ మంజుల తండాలో ఉన్న తన ఇంటిలో కిరాణ దుకాణాన్ని నిర్వహిస్తుంది. కాగా ఉదయం 11 గంటలకు బైకుపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని యువకులు సిగరెట్లు కావాలని అడిగారు. వారు అడిగిన బ్రాండు లేవని చెప్పగా.. మరోసారు వచ్చిన వారు దుకాణంలో అందుబాటులో ఉన్న ఇతర సిగరెట్లు, అగ్గిపెట్టె, సోంపు తీసుకొని వెళ్లారు. తిరిగి రెండు నిమిషాల్లో మళ్లీ వచ్చిన యువకులు బిస్కెట్ ప్యాకెట్ ఇవ్వమని అడగ్గా.. అందులో ఒకడు ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును లాగాడు. వెంటనే తేరుకున్న మంజుల నిందితుడ్ని గట్టిగా ప్రతిఘటిస్తూ అరవడంతో వెంటనే ఇద్దరు బైకుపై పారిపోయారు. విషయం తెలుసుకున్న సీఐ నర్సింహారావు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత మహిళతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో చోరీకి పాల్పడిన యువకులు, బైకును గుర్తించేందుకు వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.